
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు
5
శనివారం 29 నవంబరు 2025

జిల్లా సరిహద్దు ప్రాంతంలోని ఎర్ర కొండలు



కొలిమిగుండ్లలో నక్సల్స్ కలకలం!

● ఎర్రకోన కొండల్లో ఛత్తీస్‌గడ్ పోలీసుల ఆరా

కొలిమిగుండ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండలంలో నక్సల్స్ కలకలం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అనంతపురం జిల్లా సరిహద్దు ప్రాంతంలోని ఎర్రకోన కొండల్లో నక్సల్స్ సంచరిస్తున్నారంటూ పలువురు చర్చించుకుంటున్నారు. దీనికి బలం చేకూరుస్తూ శుక్రవారం ఉదయం జిల్లా సరిహద్దు ప్రాంతంలోని నేలబిళం, ఓబులేసు కోన ప్రాంతాల్లో ఎర్రకోన కొండలను ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన పోలీసులు సందర్శించారు. సుమారు రెండు వాహనాల్లో 20మంది వరకూ ఛత్తీస్‌గడ్ పోలీసులు ఆ కొండల వద్ద మ్యాప్ బయటకు తీసి పరిశీలించారు. అదేదారిలో పయనిస్తున్న కొందరి వాహనదారులను పోలీసులు ఆపి విచారణ చేశారు. కాగా ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలను కలుపుతూ ఈఎర్రమల కొండలు పెద్ద ఎత్తున విస్తరించి ఉన్నాయి. ఇటీవల ఛత్తీస్‌గడ్, ఏపీ సరిహద్దు ప్రాంతాల్లో భారీ ఎన్‌కౌంటర్లు చోటు చేసుకోవడం, పలువురు నక్సల్స్ మృతి చెందడం ఘటనలు జరిగాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో పోలీసులు భారీ కూబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లోనే కొలిమిగుండ్ల మండలం సరిహద్దు కొండల్లో గాలి మరల సమీపంలో కొంత మంది నక్సల్స్ తలదాచుకుంటున్నార్న అనుమానాలు ఉండటంతో ఛత్తీస్‌గడ్ పోలీసులు ఎర్రకోన కొండలకు వచ్చినట్లు సమాచారం. మరోవైపు గతంలో బెలుం గనులు, కొండల్లో నక్సల్స్ ఆశ్రయం పొంది, పోలీసులతో ఎదురు కాల్పులు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో మరోసారి మండలంలోని నక్సల్స్ సంచారం ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

మల్లన్న భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం

● శ్రీశైలం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ రమేశ్‌నాయుడు



శ్రీశైలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు ఒకటో తేదీ నుంచి మల్లన్న భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాలు ఇవ్వనున్నట్లు ఛైర్మన్ రమేష్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్పర్శ దర్శనం టికెట్లు పొందిన వారికి రెండు లడ్డూలు, అతిశీఘ్ర దర్శనం టికెట్లు పొందిన వారికి ఒక లడ్డూను ఉచిత ప్రసాదంగా ఇవ్వనున్నారు. గోకులం ఆధునికీకరణ, నూతన డొనేషన్ కౌంటర్, ఛైర్మన్ చాంబర్, ఉచిత లడ్డూ ప్రసాద, కైలాస కంకణ కౌంటర్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అంధకారంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం

● కరెంటు బిల్లు చెల్లించలేదని కనెక్షన్ కట్

కొలిమిగుండ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం అంధకారంలో మునిగిపోయింది. కరెంటు బిల్లు చెల్లించలేదంటూ విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్ కట్ చేయడంతో ఆలయ ప్రాంగణంలో చీకట్లు అలుముకున్నాయి. రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వారు కోట్లాది రూపాయలతో ఆలయాన్ని పునరుద్ధరించారు. దీంతో నెల రోజుల క్రితం వరకు వారే బిల్లు చెల్లించేవారు. ఇటీవల పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో ఆలయాన్ని రాష్ట్ర మంత్రులు ఘనంగా ప్రారంభించారు. ఆలయ పూర్తి కావడంతో తాము విద్యుత్ బిల్లు చెల్లించలేమని, దేవదాయ శాఖ వారే చూసుకోవాలని విద్యుత్ అధికారులకు రామ్‌కో ప్రతినిధులు తెలిపారు. అయితే పునరుద్ధరణ అనంతరం ఎల్ఈడీ విద్యుత్ లైట్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడంతో బిల్లు రూ.20వేలకు పైబడి వస్తోంది. దీంతో ఎవరూ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు కనెక్షన్ తొలగించారు.

9వేల కుష్ఠు అనుమానిత కేసులు

● డీఎన్ఎంవో తేజశ్విని
● చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో తనిఖీలు



కుష్ఠువ్యాధి అనుమానిత కేసును పరిశీలిస్తున్న డీఎన్ఎంవో తేజశ్విని

చాగలమర్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠువ్యాధి లక్షణాల ఇంటింటి సర్వేలో భాగంగా 9వేల అనుమానిత కేసులను గుర్తించినట్లు డిస్ట్రిక్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ తేజశ్విని తెలిపారు. శుక్రవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలను తనిఖీచేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. కుష్ఠువ్యాధి అనుమానిత కేసులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 19లక్షల కుటుంబాలుండగా ఇప్పటి వరకు 13.70లక్షల కుటుంబాలను సర్వేచేసి అందులో 9వేల అనుమానిత కేసులను గుర్తించామన్నారు. వ్యాధి నిర్ధారణ కోసం వైద్యపరీక్షలు చేయగా 3కేసులు మాత్రమే వ్యాధి లక్షణా లు ఉన్నట్లు నిర్ధారించామని అన్నారు. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు జిల్లాలో కుష్ఠువ్యాధి లక్షణాలున్న 30 కేసులకు చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. 1,606 టీమ్‌లతో సర్వే కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు అంజలి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ నాయక్, హెచ్ఏ మనోహర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

బనగానపల్లి రెవెన్యూ డివిజన్‌గా గెజిట్ విడుదల

నంద్యాల నూనెపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లిని నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఏవైనా అభ్యంతరాలుంటే, వాటిని 30 రోజులలోపు కలెక్టర్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా సమర్పించాలని పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్‌ను అన్ని గ్రామ సచివాలయాలు, మండల కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో ప్రచురించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

భారీ వర్షాలు పడే అవకాశం

● కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శని, ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న, వరి పంటల కోత పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే కోత కోసిన పంటను పట్టాలు కప్పి రక్షించుకోవాలని, తేమకు గురికాకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పంట దిగుబడిని తప్పనిసరిగా గోడౌన్లలో నిల్వ చేసుకోవాలన్నారు. వర్షాల సమయంలో ప్రజలు విద్యుత్ తీగలు, చెట్లు, నీటితో నిండిన రహదారుల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌పై వివక్ష



రెండేళ్లుగా స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థుల ప్రవేశాలు నిలిపేశారు. మూడు నెలల్లో చదువు పూర్తి చేసుకునే సమయంలో ప్రవేశాలు కోరడంతో తల్లిదండ్రుల నుంచి పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రీడాకారులకు అవసరమైన వసతులు, నిధులు, క్రీడా పరికరాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2017లో టీడీపీ, 2021లో వైసీపీ పలు చోట్ల గిరిజన స్పోర్ట్స్ స్కూళ్లను ప్రారంభించాయి. వాటిని అభివృద్ధి చేయడంలో వెనుకడుగు వేశాయి. 2021 ఫిబ్రవరిలో ప్రారంభించిన పాఠశాలల్లో 2022-23లో ప్రవేశాలు నిలిపివేశారు. మళ్లీ 2023-24 ఆగస్టులో ప్రవేశాలు నిర్వహించారు. 2024-25లో మళ్లీ ప్రవేశాలు ఆపేశారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రవేశ పరీక్షలు నిర్వహించాల్సిన ఏపీ గురుకుల పాఠశాలల సంస్థ విద్యాసంవత్సరం చివరిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయడానికి దరఖాస్తులు కోరడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- విద్యా సంవత్సరం చివరిలో ప్రవేశాల కోసం దరఖాస్తులా?
- విద్యార్థులు జీవితాలతో చెలగాటం
- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న వైనం
- కరువైన కనీస వసతులు
- కనపడని మైదానాలు
- క్రీడల్లో ప్రాక్టీసు చేసేదేలా?

పాణ్యం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్పోర్ట్స్ స్కూళ్లపై ప్రభుత్వం వివక్ష చూపుతోంది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. సమయం సందర్భం లేకుండా 2025-26 విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్న సమయంలో క్రీడా పాఠశాలలకు దరఖాస్తు కోరడం విడ్డూరంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 27వ తేదీ లోపల బాలురు, 28వ తేదీ లోపు బాలికల స్పోర్ట్స్ స్కూల్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ శ్రీశైలం పీవో వెంకటశివప్రసాద్ ప్రకటించారు. 2017లో టీడీపీ ప్రభుత్వం విశాఖ ఏజన్సీ లోని అరకులో గిరిజన విద్యార్థులను క్రీడారంగంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా గిరిజన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసింది. దీంతో గిరిజన విద్యార్థులు క్రీడా రంగంలో రాణించడానికి మంచి అవకాశమేర్పడింది. కాగా ఈపాఠశాలకు దీటుగా మరిన్ని పాఠశాలలను ఏర్పాటు చేయడానికి వైసీపీ ప్రభుత్వం 2021 ఫిబ్రవరి 11న రాష్ట్ర వ్యాప్తంగా ఆరు ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసింది.

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ..

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (పీటీజీ చెంచు) శ్రీశైలం పరిధిలో అనంతపురం, కృష్ణా, కర్నూలు, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, నంద్యాల జిల్లాల విద్యార్థినులకు నంద్యాల జిల్లా పాణ్యం మండలం బలపనూరు పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద గల ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలను క్రీడా పాఠశాలగా 6, 7, 8 తరగతులను ఏర్పాటుచేసింది. క్రీడలపై ఆసక్తి గల బాలికలను 73మందిని క్రీడల్లో ఎంపిక చేసి 37 మందికి ప్రవేశం కల్పించారు.

మిగతా 6లో

రూ.10.41 కోట్ల ఇంటి పన్నులు లక్ష్యం

- డీపీఓ లలితాబాయి



రుద్రవరంలో మాట్లాడుతున్న డీపీవో లలితాబాయి

రుద్రవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రూ.10.41 కోట్ల మేర ఇంటి పన్నులను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీపీఓ (జిల్లా పంచాయతీ అధికారి) లలితాబాయి అన్నారు. శుక్రవారం రుద్రవరంలోని ఒకటో సచివాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీపీఓ లలితాబాయి మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.12.15లక్షలు వసూలైందన్నారు. సాధారణంగా ప్రజలు డిసెంబరు, జనవరి మాసాల్లో ఇంటి పన్నులు చెల్లిస్తారన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీటితో పాటు వాటర్‌ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యమన్నారు. ఆ దిశగా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అవినీతిపై విచారణ చేపడుతున్నామన్నారు. ఇప్పటి వరకు త్రిమెన్ కమిటి ఒక నివేదికతో పాటు అప్పటి డీఎల్‌పీఓ రాంబాబు మరో నివేదిక ఇచ్చారన్నారు. ఆ నివేదికల్లోని అంశాలపై విచారణ చేస్తున్నామన్నారు. ఈవో సుబ్బారావు విధుల నిర్వహణలో ఉన్నప్పుడు, 2021-25 మధ్య జరిగిన లావాదేవీల్లో అప్పటి ఈఓలు సుబ్బరాయుడు, రఫీ, మరో ఈఓ సుబ్బారావులపై విచారణ నిర్వహిస్తున్నామన్నారు. ఒకటి రెండురోజుల్లో పూర్తిస్థాయి నివేదిక వెల్లడి అవుతుందని డీపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఇన్‌చార్జి ఈఓ రామకృష్ణ ఉన్నారు.

పోలీస్ సంక్షేమానికే అధిక ప్రాధాన్యం

● ఎస్పీ సునీల్ షెరాన్



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్ , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ సిబ్బంది సంక్షేమానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సంక్షేమ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బందికి ప్రాధాన్యమిస్తామన్నారు. విధుల్లో సిబ్బంది ఇబ్బంది పడకుండా వారి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో విభాగాల వారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హోంగార్డులు కూడా వారి సమస్యలను ఎస్పీకి వివరించారు.

డోంట్ కేర్!

ఎవరెన్ని చెప్పినా మేం వినం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధన పత్తి రైతులను నానా ఇబ్బందిపెడుతోంది. పత్తిలో 8-12 శాతం తేమ ఉంటేనే కొంటామని సీసీఐ అధికారులు తేల్చి చెప్పున్నారు. దీని మీద సీఎం మొదలుకుని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు 14 శాతం తేమ ఉన్నా రైతుల నుంచి పత్తి కొనాలని ఆదేశించారు. పదే పదే ఉత్తర్వులు జారీ చేస్తున్నా సీసీఐ అధికారులు మాత్రం లక్ష్యపెట్టడం లేదు. ఎవరేం చెప్పినా మా నిబంధనల మేరకే పత్తిని కొంటామంటున్నారు. దీనికి తోడు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం రైతులకు తలనెప్పిగా మారిపోయింది.



గ్రామాల్లో తక్కువ తూకాలతో జోరుగా పత్తి కొనుగోళ్లు

- ప్రకృతి వైపరీత్యాలతో సంబంధం లేదంటున్న సీసీఐ అధికారులు
- 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే పత్తి కొనుగోలు
- కపాస్ కిసాన్ అవాంతరాలపై నోరు మెదపని సీసీఐ
- ఇప్పటి దాకా సీసీఐ కొనుగోలు చేసింది 40 క్వింటాళ్లే..
- వ్యాపారులు కొన్నది 5 లక్షల క్వింటాళ్ల పైమాటే

రాష్ట్రంలోనే పత్తి సాగులోనే మొదటి స్థానం.. 7 లక్షల ఎకరాల్లో పత్తి సాగు :

కేంద్ర ప్రభుత్వం క్వింటం పత్తికి రూ.8,110 మద్దతు ధరను ప్రకటించింది. దీంతో రైతులు ఖరీఫ్‌లో పెద్ద ఎత్తున పత్తి పంటను సాగు చేశారు. కర్నూలు జిల్లాలో 6,71,064 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా.. నంద్యాల జిల్లాలో మరో 30వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా పత్తి సాగులో ఈసారి మొదటి స్థానంలో నిలిచింది. ముందస్తు వర్షాలకు రైతులు మే చివరి వారంలోనే పత్తిని సాగు చేశారు. ప్రస్తుతం పెద్ద ఎత్తున రైతుల వద్ద పత్తి నిల్వ ఉంది. 5 క్వింటాళ్ల దిగుబడి మేరకు 7 లక్షల ఎకరాలకు 35 లక్షల క్వింటాళ్ల పత్తి రైతులు ఈసారి పండించారు. సీసీఐ సంస్థ రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయడంలో మొదటి నుంచి ఆటంకాలు పెడుతూనే వస్తుంది. రెండు నెలల క్రితమే రైతుల చేతికి పత్తి అందినా సీసీఐ అధికారులు మాత్రం అదిగో.. ఇదిగో అంటూ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తాత్సారం చేస్తూ వచ్చారు. చివరికి రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిళ్ల మేరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను గత నెల ఏర్పాటు చేసింది. రాష్ట్రం మొత్తం మీద పత్తి కొనుగోలుకు సీసీఐ అధికారులు 30 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అందులో 20 కేంద్రాలు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. అయితే.. అవన్నీ కాగితాలకే పరిమితమైపోయాయి. కర్నూలు జిల్లాలో 20 కేంద్రాలకు గాను కేవలం 11 కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఆదోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరులో సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. అయితే ఇంకా 9 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండానే చేతులెత్తేశారు. నంద్యాల జిల్లాలో కేవలం ఒకే ఒక్క కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



ఈ రైతు పేరు రాము. కల్లూరు మండలం గోకులపాడు గ్రామం. తనకున్న మూడెకరాల్లో ఖరీఫ్ పంటగా పత్తిని సాగు కోసం 60 వేల దాకా ఖర్చు పెట్టాడు. అధిక వర్షాల వల్ల ఎకరాకు 4 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. చేతికందిన 15 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోడానికి కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునేందుకు నానా తంటాలు పడ్డాడు. నెల రోజుల నుంచి స్లాట్ బుక్ కావడం లేదని, ఇంట్లోనే పత్తిని నిల్వ చేసుకుని అమ్ముకోలేకపోతున్నాని రాము ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని దాదాపు 3లక్షల మంది రైతులు ఎదుర్కొంటున్నారు.

నామ మాత్రంగానే కొనుగోళ్లు:

రైతులు ఖరీఫ్‌లో పెద్ద ఎత్తున పత్తి పంటను సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ యంత్రాంగం ముందుగానే అంచనా వేసింది. అయితే అంచనాలకు తగ్గట్లుగా సీసీఐ అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోయారు. కర్నూలు జిల్లాలో ఆదోని నియోజకవర్గంలో 73,271 ఎకరాల్లో పత్తి పంట సాగైంది.



అధిక వర్షాలకు మాడిపోయిన పత్తి

మిగతా 6లో..

బాలిక ప్రసవం

● కడుపునొప్పితో ఆసుపత్రికి రాక..
● ప్రసవం చేసిన వైద్యులు
● బంధువుల అబ్బాయే కారణమంటున్న మైనర్



వివరాలు సేకరిస్తున్న పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు

నందికొట్కూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఓ బాలిక ప్రసవం అయిన సంఘటన నంద్యాల జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాలు.. మిడ్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17.9 సంవత్సరాలు) ఇటీవలే ఇంటర్ పూర్తిచేసింది. గురువారం ఉదయం కడుపునొప్పి రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆమె తల్లి తీసుకొచ్చారు. వైద్యులు పరిశీలించి పరీక్షలు చేసి చూడగా బాలిక కడుపుతో ఉందని తల్లికి చెప్పారు. అదే క్రమంలో పురిటి నొప్పులు రావడంతో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. తాను గత ఏడాది నందికొట్కూరులోని ఓజూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశానని ఆ బాలిక తెలిపింది. ఆ సమయంలో నందికొట్కూరు మండలంలోని ఓగ్రామానికి చెందిన తమ బంధువుల అబ్బాయితో చనువుగా ఉన్నట్లు బాలిక తెలిపింది. ఆ సమయంలో అతడితో తరచూ బయటకు వెళ్లేదాన్ని అని బాలిక తెలిపింది. దీంతో పుట్టిన ఆడ శిశువును మీ వెంట తీసుకెళ్తారా? లేక చిల్డ్రన్‌హోంకు తీసుకెళ్లాలా? అని ఐసీడీఎస్ అధికారులు ప్రశ్నించారు. తన భర్తతో చర్చించి విషయాన్ని చెబుతా మని బాలిక తల్లి ఐసీడీఎస్ అధికారులకు వివరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

జిల్లా కోర్టు పీపీగా రంగా రవికుమార్



జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్దిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంగా రవికుమార్

కర్నూలు లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది ఎస్.రంగా రవి కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించి జిల్లా ప్రధాన న్యాయాధి కారి జి.కబర్దిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన 1993లో దివంగత సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరాములు ఆఫీసులో జూనియర్‌గా చేరి న్యాయ వాదిగా పలు కేసుల్లో వాదించారు. ఈయన పదవిలో మూడు సంవత్స రాలు కొనసాగుతారు. రవికుమార్ నియామకంపై సీనియర్ న్యాయవా దులు ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, శ్రీవాత్సవ, డి.శివశంకర్ రెడ్డి, పీవీ శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.హరినాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయ సమీక్ష



రివ్యూ మీటింగ్ నిర్వహిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, బాధ్యతలు, సలహాలు, జైలు తని ఖీలు మొదలైన విషయాల గురించి వివరించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్ని క్రిమినల్ కేసులలో నిందితులకు బెయిల్ మంజూరయ్యేలా చేసిన కృషిని వివరించాలని ఆదేశించారు. ఈ మీటింగ్‌లో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏ.సులోచన తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయీ సంఘ సమా వేశాలు నిర్వహించేం దుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి 11.00 గంటల వరకు 2వ, 11.00 నుంచి 12.00 గంటల వరకు 3వ, 12.00 గంటల నుంచి 1.00 గంటల వరకు 6వ స్థాయీ సంఘం సమావేశాలు ఉంటాయని వివరించారు. మధ్యాహ్నం 1.00 నుంచి 2.00 గంటల వరకు 4వ, 2.30 గంటల నుంచి 3.30వరకు 5వ, 3.30 నుంచి 5.30 వరకు 1, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు.

డిగ్రీలో ఐదుగురి డిబార్

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివ ర్సిటీ పరిధిలో నిర్వహించిన డిగ్రీ 3వ సెమిస్టర్లో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8,365 మంది దరఖాస్తు చేసుకోగా 7,560 మంది పరీక్షలకు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

పూలే మార్గంలో పయనించాలి

- డీబీసీడబ్ల్యూవో ప్రసూన
- జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పూలే దంపతులు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని, యువత పూలే మార్గంలో పయ నించాలని డీబీసీడబ్ల్యూవో ప్రసూన అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పూలే చిత్రపటా నికి డీబీసీడబ్ల్యూవో ప్రసూన, డీజీ డబ్ల్యూవో సురేష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీసీ డబ్ల్యూవో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆంజనేయులు, బీసీ, ఎస్టీ వెల్ఫేర్ కార్యాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.



బిర్లాగేటు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వై.నాగేశ్వరరావు యాదవ్

పూలే ఆశయాలను నెరవేరుద్దాం

రావు పూలే ఆశయాలను నెరవేరుద్దామని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వర రావు యాదవ్ పిలుపునిచ్చారు. బిర్లాగేటు సర్కిల్‌లోని ఏర్పాటుచేసిన మహాత్మా జ్యోతిరావు పూలే దం పతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, కుమ్మరి శాలివా హన సంక్షేమ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు సుగూరు వెంకటేశ్వర్లు, సత్రం రామకృష్ణ శేషగిరి, పీవీ కృష్ణయ్య బీసీలు పాల్గొన్నారు.

టీటీసీ ఫలితాలు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్(టీటీసీ) పరీక్షా ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శుక్రవారం తెలిపారు. ఈ ఫలితాలను అధికారిక డీఈవో వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఉత్తీర్ణత సర్టిఫికెట్లను విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లాల విద్యాశాఖ అధికారులకు సకాలంలో పంపిస్తామని తెలిపారు.

డోంట్ కేర్

(5వ పేజీ తరువాయి)

ఆలూరులో 19,635 ఎకరాలు, ఆస్పరిలో 50,743 ఎకరాలు, సీ.బెళ గల్‌లో 25,568 ఎకరాలు, చిప్పగిరిలో 12,028 ఎకరాలు, దేవనకొం డలో 54,659 ఎకరాలు, గోనెగండ్లలో 35,190 ఎకరాలు, గూడూరులో 20,116 ఎకరాలు, హాలహర్విలో 9,966 ఎకరాలు, హొళగుందలో 36,693 ఎకరాలు, కల్లూరులో 20,456 ఎకరాలు, కోడుమూరులో 18,055 ఎకరాలు, కోసిగిలో 30,348 ఎకరాలు, కౌతాళంలో 59,697 ఎకరాలు, క్రిష్ణగిరిలో 24,056 ఎకరాలు, కర్నూలు రూరల్‌లో 15,203 ఎకరాలు, మంత్రాలయంలో 28,891 ఎకరాలు, నందవరంలో 44,241 ఎకరాలు, ఓర్వకల్లులో 5,652, పత్తికొండలో 20,320 ఎకరాలు, పెద్దక డుబూరులో 24,276 ఎకరాలు, ఎమ్మిగనూరులో 39,657 ఎకరాలు, వెల్దుర్తిలో 8,847 ఎకరాలు మొత్తం కర్నూలు జిల్లాలో 6,71,064 ఎక రాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారు. నంద్యాల జిల్లాలో మరో 30వేల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. ఎకరాకు 5 క్వింటాళ్ల చొప్పున 35 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి రాగా, ఇప్పటి దాకా సీసీఐ అధికా రులు రైతుల నుంచి కొనుగోలు చేసింది కేవలం 40 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే. సవాలక్ష ఆటంకాల మధ్య సీసీఐ కేంద్రాల్లో రైతులు పత్తిని అమ్ముకోలేకపోయారు. ఓ వైపు అప్పు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి, ఇంకో వైపు అధిక వర్షాల కారణంగా.. మరో దారి లేక రైతులు గ్రామాల్లోని వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. దాదాపు 5లక్షల క్వింటాళ్ల పత్తిని అమ్ము కున్నారు..: రైతులు చాలా మంది సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ము కుంటే.. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటా నికి రూ.8,100 నుంచి రూ.7,500 దాకా చేతికి లభిస్తుందని రైతులు ఇళ్లలోనే పత్తిని బస్తాల్లో నింపి దాచుకున్నారు.



కర్నూలు పెంచికలపాడులోని సీసీఐ కేంద్రం

కపాస్ కిసాన్ యాప్‌తో తంటాలు

గత సంవత్సరం కేవలం ఈక్రాప్ యాప్‌లోనే రైతులు పత్తి వివ రాలను నమోదు చేసి సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్నారు. ఈసారి ఏదో విధంగా రైతుల నుంచి తక్కువ మొత్తంలోనే పత్తిని కొనుగోలు చేయాలనే తలంపుతో సీసీఐ అధికారులు రైతులకు రకర కాల ఆటంకాలను సృష్టిస్తూ వచ్చారు. కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌ను అమలులోకి తెచ్చారు. రైతులు నేరుగా కొనుగోలు కేంద్రా లకు పత్తిని తీసుకుని అమ్మే అవకాశం లేదని, ఈ యాప్‌లో ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న తర్వాతే ఖరారు చేసిన తేదీలో కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకెళ్లి అమ్మాలని అధికారులు ఆదేశిం చడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో అధికా రులు నిర్ణయించిన సమయం ఉదయం 10 గంటలకు, కపాస్ కిసా న్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. గ్రామ రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు పనులు విడిచిపెట్టి కేంద్రాల వద్దే గంటల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూడాల్సి వస్తున్నది. కొన్నిసార్లు స్లాట్ బుక్ చేసుకున్నా కొనుగోలు కేంద్రాల వద్ద ఆ వివరాలను చూపిస్తే స్లాట్ బుక్ చేసినా రద్దయిం దని, మళ్లీ వెళ్లి స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పారు. రవాణా ఖర్చులు భరించే శక్తి లేక అక్కడే ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో క్వింటం పత్తిని రూ.6వేల నుంచి రూ.6,500కే అమ్ముకుని నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి కొనుగోలు కేంద్రాలు పని చేయకుండా ఉండ టంతో రైతులు వెనుదిరిగి రాలేక కొనుగోలు కేంద్రాల వద్దే కాచుక్కూ ర్చున్న వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు.

సీఎం, ఉన్నతాధికారులు చెప్పినా వినలేదు : సీసీఐ



ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుకుని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత, జిల్లా ఉన్న తాధికారులు ఎన్నోసార్లు రైతుల వద్ద ఉన్న పత్తి 14 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరెంత చెప్పినా తమ నిబంధనల మేరకే పత్తిని కొంటా మని సీసీఐ అధికారులు భీష్మించ డంతో రైతులు నష్టపోతున్నారు. సీసీఐ కేంద్రాల వద్ద ప్రస్తుతం పత్తిలో 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు. ప్రకృతి విపత్తులతో తమకు సంబంధం లేదని తేల్చి చెబుతున్నారు. కొన్ని కేంద్రాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు నామ్‌కే వాస్తేగా సీసీఐ అధికారులు 14 శాతం తేమ ఉన్నా రైతుల పరిస్థి తిని అర్థం చేసుకుని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం రైతుల వద్ద ఇంకా 30 లక్షల క్వింటాళ్ల మేర పత్తి నిల్వ ఉంది. సీసీఐ అధికారులు ప్రభుత్వ ఒత్తిడి మేరకు నిబంధనలను సడలించి తేమ శాతాన్ని 14 శాతం వరకు పరిగణనలోకి తీసుకుంటుందని, అప్పుడైనా పత్తిని అమ్ముకుని మద్దతు ధర పొందుదామని రైతులు ఇళ్ల లోనే పత్తి సంచులు నిల్వ చేసి ఆశగా ఎదురు చూస్తు న్నారు.

14 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేస్తామని సీసీఐ చెప్పింది



అధిక వర్షాల వల్ల రైతు లకు ఈసారి దిగుబడి బాగా తగ్గింది. కర్నూలు జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాలు, నంద్యాల జిల్లాలో ఒకటి కేంద్రాన్ని సీసీఐ అధికారులు ఏర్పాటు చేశారు. 8 నుంచి 11 శాతం తేమ ఉంటే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఒత్తిడి మేరకు ప్రస్తుతం 14 శాతం తేమ ఉన్నా రైతుల నుంచి కొను గోలు చేస్తున్నారు. కపాస్ కిసాన్ యాప్ వల్ల రైతులు ఇబ్బందులు పడ లేక వ్యాపారులకే ఎక్కువ మొత్తంలో పత్తిని అమ్ముకుం టున్నారు. త్వరలోనే ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 14 శాతం తేమ ఉంటే కూడా పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు నిర్ణయం తీసు కునే అవకాశం ఉంది. తక్కువ తూకాలు వేసి రైతుల నుంచి పత్తిని కొను గోలు చేసే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం.

- నారాయణమూర్తి, ఏడీఎం

ఎమ్మెల్యే పార్థసారథి

ఇంటిని ముట్టడించిన ప్రజలు

ఆదోని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్త మండలాల ఏర్పాటు విషయంలో ఆదోని నియోజకవర్గంలో రగడ రాజుకుంది. పెద్దతుంబళం గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పది గ్రామాల ప్రజలు శుక్రవారం 200 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదోనిలోని ఎమ్మెల్యే పార్థ సారథి ఇంటిని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే పార్థసారథి స్పందిస్తూ ప్రజాభిప్రాయ సేకరణకు ప్రభుత్వం 30 రోజుల సమయం ఇచ్చిందన్నారు. ఈలోగా సమస్యను పరిష్కరిం చేందుకు కృషి చేస్తానన్నారు. ఇదిలా ఉండగా తమ గ్రామాలను ఆదోని మండలంలోనే ఉంచాలని చాగి, నారాయణపురం, ఢణా పురం, నాగనాథనహళ్లి, బసాపురం గ్రామాలకు చెందిన వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. తమ గ్రామాలను ప్రతిపాదిత పెద్దహరివాణం మండలంలో చేర్చకుండా గతంలో మాదిరిగానే ఆదోని మండలంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్త మండల కేంద్రం పెద్దహరివాణానికి దాదాపు 30 కిలో మీటర్ల దూరం ఉంటుందని, అదే ఆదోని అయితే ఆరు కిలోమీటర్ల లోపే ఉంటుందన్నారు. తమ గ్రామానికి మండలంగా గుర్తించినం దుకు పెద్దహరివాణం గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలి పారు.



పెద్ద తుంబళం మండల కావాలంటూ ధర్నా చేస్తున్న పది గ్రామాల ప్రజలు

పెరుగుతున్న జీడీపీ నీటి మట్టం

గోనెగండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా(హెచ్ ఎన్ఎస్) నీరు నాలుగు రోజులుగా గాజులదిన్నె ప్రాజెక్టును చేరు తోంది. దీంతో ప్రాజెక్టు లో నీటి మట్టం పెరుగుతోంది. హంద్రీ-నీ వాలో పదిరోజుల క్రితం 250 క్యూసెక్కుల నీరు జీడీపీ కి విడుదల అయితే గత నాలుగు రోజులుగా జీడీపీకి 150 క్యూసెక్కులు చేరి నట్లు జీడీపీ అధికారులు తెలిపారు. ఈ కారణంగా ప్రాజెక్టులో ప్రస్తుతం 3.6 టీఎంసీ(గ్రాస్) నీరు చేరింది. హెచ్ఎన్ఎస్ ద్వారా విడుదల అయిన నీరు వాగులు, వంకలు ద్వారా వృథాగా పోగా జీడీపీలోకి చేరేలోపు 150 క్యూసెక్కులు చేరుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌కు గాను మూడు రోజుల క్రితం జీడీపీ నీరు విడుదల చేశారు. ఇప్పటి వరకు ప్రాజెక్ట్ కింద దాదాపు 13వేల ఎకరాలు సాగు అవుతున్నట్లు సమాచారం. పంటలు చేతికి అందే వరకు సాగు నీరు విడుదల చేయాల్సి వస్తుంది. అంటే వచ్చే ఏడాది మార్చి నెల చివరి వరకు సాగు నీరు అందించాల్సి ఉంటుంది.



జీడీపీలోకి చేరుతున్న హెచ్ఎన్ఎస్ నీరు

క్వార్టర్ ఫైనల్‌కు ప్రవేశించిన జట్లు

- బేస్ బాల్‌లో ప్రతిభ చాటిన జిల్లాలు

ఆళ్లగడ్డ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అహోబిలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో జరుగుతున్న జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్‌కు చేరారు. శుక్రవారం జరిగిన అండర్-17 విభాగం బేస్ బాల్ పోటీలలో కడప, కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయన గరం, నెల్లూరు, వెస్ట్ గోదావరి, గుంటూరు జిల్లా లకు చెందిన క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. అలాగే బాలికల విభాగంలో విశాఖ పట్నం, కడప, కృష్ణా, శ్రీకాకుళం, చిత్తూరు, కర్నూలు, విజయనగరం, గుంటూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులు క్వార్టర్స్‌లోకి ప్రవేశిం చారు. వీరు ఈనెల శనివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొంటారు. రెండు రోజులుగా వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని టోర్నమెంట్ నిర్వాహకులు నాగేంద్ర తెలిపారు. ఈ పోటీలను పారిశ్రామిక వేత్త చక్రం బీడీ షబ్బీర్, ముల్లా షఫీ, షాబుల్, ఎస్‌జిఎఫ్ కార్యదర్శులు విశ్వనాథ్, ఆశాజ్యోతి, వివిధ జిల్లాల పీఈటీలు తిలకించారు.



క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న జట్లతో నిర్వాహకులు

స్పోర్ట్స్ స్కూల్‌పై వివక్ష

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు ప్రారంభించే సమయంలో వాటి అభివృద్ధికి రూ.30లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఒక్క పైసా కూడా రాలేదు. టీడీపీ హయాంలో విశాఖ ఏజన్సీ ప్రాంతంలోని అర కులో గిరిజన విద్యార్థులను క్రీడల్లో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేసింది. దీని కంటే మిన్నగా ఆరు పాఠశాలలను వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు.

ప్రత్యేక నిధులు కేటాయించకుండానే..

క్రీడా పాఠశాలకు ప్రత్యేక నిధులు కేటాయించకుండానే పాఠశాలలు ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబు అని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తు న్నాయి. స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన బాలికలకు రోజూ రూ.125లు కేటాయిం చాలి. సాధారణ బాలికలకు కేటాయించే రూ.47లోనే క్రీడా విద్యార్థులను సరిపుచ్చుతున్నారు. క్రీడాకారులు శారీరక ధృడత్వాన్ని పొందలేక క్రీడల్లో రాణించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో క్రీడాపాఠశాలలో చేరే విద్యార్థులు పాఠశాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రీడలకు అనువైన క్రీడా మైదానం లేకపోవడంతో ఇతర పాఠశాలల క్రీడామైదానాలపై ఆధారపడవ లసిన దుస్థితి ఏర్పడింది. క్రీడలకు సరైన ప్రోత్సాహం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. . గతంలో పాఠశాలలో చేరిన క్రీడాకారులు రెండేళ్లపాటు క్రీడా శిక్షణకు దూరమయ్యారు. ఈ ఏడాది ఎంపిక చేసిన విద్యార్థినులకు అదే పరిస్థితి కొనసాగితే లక్ష్యంతో చేరిన విద్యార్థుల ప రిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సరైన సమయం కాదు

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు, బ్యాక్‌లాగ్ కల్పించడం సంతోషించదగ్గ విష యమే కానీ ఈ విద్యా సంవత్సరం సగ భాగం పూర్తయిన తర్వాత అడ్మిషన్ కోరడం సరైంది కాదు. స్పోర్ట్స్ స్కూల్‌కు అన్ని ఏర్పాట్లు ఏప్రిల్, మే మాసంలో పూర్తిచేసి ఉంటే బాగుండేది.

- సిమియోన్, పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్

గురుకుల కమిషనర్ ఆదేశాల మేరకే..

రాష్ట్ర గురుకుల పాఠశాలల సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకే స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నాం. ఈఏడాదిగానీ, వచ్చే సంవత్స రానికి గానీ విద్యార్థులను పాఠశా లల్లో చేర్చుకోవచ్చు. ఇప్పటివరకు అడ్మి షన్లకు మాత్రమే ఆదేశాలు అందాయి. విద్యార్థులకు ఎటువంటి నిధులు గానీ, వ్యాయామ ఉపాధ్యాయులనుగానీ కేటాయించలేదు.

- వెంకట శివప్రసాద్, పీవో, ఐటీడీఏ శ్రీశైలం

తీర్మానం లేకుండా ఎలా?

- ఎవరి ప్రయోజనాల కోసం విశ్రామ్ సదన్?
- కర్నూలు జీజీహెచ్ హెచ్‌డీఎస్ సభ్యుడు బి.రామాంజనేయులు



కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హెచ్‌డీఎస్ తీర్మానం లేకుండా, ఎజెండా రూపొందించకుండా రూ.14.6 కోట్లతో విశ్రామ్ సద న్ భవన నిర్మాణాలు ఎలా చేపడతారని కర్నూలు జీజీహెచ్ హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ(హెడ్‌డీఎస్) సభ్యుడు బి.రామాంజనేయులు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన కర్నూలు జీజీహెచ్ లో విలేకరులతో మాట్లాడారు. విశ్రామ్ సదన్‌ను ఎవరి స్వలాభం కోసం కడుతున్నారనీ, దీని వల్ల ఉపయోగం రాజకీయ నేతలకా? అధికారులకా? అని ప్రశ్నించారు. విశ్రామ్ సదన్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. విశ్రామ్ సదన్ బదులు ఆసుపత్రిలో నిలిచిపోయిన ఐపీడీ (ఐపీవో) బ్లాక్ నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు.

నయా ట్రెండ్..

- అభిమాన నేతల పేర్లతో అంకెలు
- ప్రత్యేకతను సంతరించుకుంటున్న నంబర్ ప్లేట్లు

ట్రెండ్



తెలంంగాణలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటర మణరెడ్డి మోదీ పేరుతో కారు నంబర్ ప్లేట్‌ను తయారు చేయించిన దృశ్యం

ప్రస్తుతం వాహనాల నంబర్ ప్లేట్ల ఎంపికలో వాహనదారులు నయా ట్రెండ్ ఫాలో అవుతున్నారు. తమ అభిమాన నేతల పేర్లతో కూడిన విధంగా అంకెలతో రూపొందించిన వాహనాల నంబర్ ప్లేట్లను తయారు చేయించుకుంటున్నారు. తొలుత తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి తన అభిమాన నేత, ప్రధాని నరేంద్రమోదీ పేరు వచ్చే విధంగా 4749 నంబర్‌ను హిందీలో మోదీ అని అక్ష రాలు కనిపించే విధంగా తన కారు నంబర్ ప్లేట్‌ను తయారు చేయించారు. ఈ నంబర్ ప్లేట్.. ఏకంగా తెలుగు రాష్ట్రాల్లోనే ఓ ప్రత్యేకతను సొంతం చేసు కుంది. ఇందులో భాగంగా ఆత్మకూరుకి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి తన అభి మాన నేత, యూపీ సీఎం యోగి ఆది త్యానాథ్ పేరులో యోగి అని కనిపించా లన్న ఉద్దేశ్యంతో 4061 ఆంగ్లంలో యోగి అని కనిపించే విధంగా నంబర్ ప్లేట్‌ను తయారు చేయించుకున్నారు. ఇది కూడా స్థానికంగా ఒక ప్రత్యేకతను సంతరించు కుంది. వాస్తవానికి వాహనాల నంబర్ ప్లేట్ల ఎంపిక రవాణా శాఖ అధికారులు నిర్దేశించిన నిబంధనల ప్రకారం మాత్రమే ఉండాలి. ఫ్యాన్సీ పేర్లతో కూడిన నంబర్ల వ్యవహారం నిబంధనలకు విరుద్ధమే అయినప్పటికీ చాలా మంది న్యూట్రెండ్‌ను ఫాలో అవు తున్నారు. ఏదిఏమైనా.. అభిమాన నేతల పేర్లతో కూడిన వాహ నాల నంబర్ ప్లేట్లు.. నయా ట్రెండ్‌లో ఉండటాన్ని చూసి జనం ఆశ్చర్యానికి లోనవుతున్నారు.

- ఆత్మకూరు, ఆంధ్రజ్యోతి



యోగీ పేరుతో బైకు ముందు భాగంలో నంబర్ ప్లేటు



ఆత్మకూరులో యోగి పేరుతో బైకు నంబర్ ప్లేటు తయారు చేయించిన దృశ్యం

ప్యాపిలిలో ఏపీఐఐసీకి 4.96 ఎకరాల భూమి అప్పగింత

నంద్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు అధ్య క్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినేట్ సమావేశంలో పలు అంశా లకు సంబంధించి ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలం మాధవరం గ్రామం లోని రూ.25.04 లక్షలు విలువ చేసే 4.96 ఎకరాల ప్రభుత్వ భూమిని(సర్వే నెంబర్ 691 లో 3.21 ఎకరాలు, సర్వే నెంబర్ 692లో 1.75 ఎకరాలు) ఉమ్మడి కర్నూలు జిల్లా ఏపీఐఐసీ అప్పగిస్తూ కేబినేట్ ఆమోదం తెలిసింది. సదరు భూమిని క్రషింగ్ అండ్ పల్వరైజింగ్ యూనిట్ ఏర్పాటు కోసం త్వరలో ఏపీఐఐసీ ప్రైవేట సంస్థకు అప్పగించనుంది.

రేపు కాంగ్రెస్ కార్యనిర్వాహక సమావేశం



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల నూనెపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో ఈనెల 30న నిర్వహించనున్న జిల్లా కార్యనిర్వాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఐసీసీ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి బెంగళూరు అభివృద్ధి అథారిటీ (బీడీఏ), శాంతినగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే, ఏఐసీసీ పరిశీలకుడు ఎన్ఏ హరిస్ ముఖ్యఅతిథిగా హాజరు అవుతారన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అవుకు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుర్రాల వీధికి చెందిన గుర్రాల రామస్వామి (48) కుటుంబ కలహాలతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాలివీ.. ఉదయం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి రామస్వామిని చికిత్స కోసం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రామస్వామికి భార్య కళావతి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

పెద్దకడబూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నతుంబళం గ్రామ సమీపంలో శుక్రవారం లారీ మంటల్లో దగ్ధమైంది. వివరాలివీ.. తాండూరు నుంచి కేరళకు నాపబండ రాళ్లను వేసుకొని లారీ బయల్దేరింది. అయితే పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామ సమీపానికి రాగానే లారీలో మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన లారీ డ్రైవర్, క్లీనర్‌లు కిందకు దూకి దూరంగా వెళ్లిపోయారు. లారీ పూర్తిగా మంటలకు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ ఏర్పడుతుందని ఏపీ, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మాంటిస్సోరి పాఠశాలను సందర్శించారు. ఆ పాఠశాలలో జరిగే ఎన్‌సీసీ 28వ పటాలపు వార్షిక పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్నూలు గ్రూపు తల్ సైనిక శిక్షణా శిబిరంలో ఎన్‌సీసీ విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ విద్యార్థులు జాతీయస్థాయి శిబిరంలో పాల్గొని ఏపీ, తెలంగాణకు మంచి గౌరవాన్ని ఉన్నత స్థాయికి చేర్చాలన్నారు. ఎన్‌సీసీ గ్రూప్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు గ్రూపు ప్రధాన అధికారి కల్నల్, అలోక్ త్రిపాఠి, పరిపాలన అధికారి శశి కుమార్, కృపాసాగర్ పాల్గొన్నారు.



కమాండర్ నర్సింగ్ సైలానీ

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

- పత్తిని విక్రయించి వెళ్తుండగా ఘటన

ఎమ్మిగనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పత్తిని అమ్ముకునేందుకు వచ్చిన ఓ రైతు బైక్ ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఎమ్మిగనూరు పట్టణంలో శుక్రవారం జరిగింది. వివరాలివీ.. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన రైతు మాల రామకృష్ణ(60) తన పొలంలో పండించిన పత్తి పంటను ఓ వాహనంలో ఎమ్మిగనూరులో విక్రయించేందుకు తీసుకొచ్చాడు. మంత్రాలయం రోడ్డులో ఉన్న జిన్నింగ్ మిల్లులో పత్తిని విక్రయించాడు. పత్తిని తీసుకొచ్చిన వాహనంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణంలోని మార్కెట్ కమిటీ సర్కిల్‌లో టీ తాగేందుకు వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. వాహనం డ్రైవర్, రైతు రామకృష్ణ రోడ్డుకు అటువైపు ఉన్న హోటల్‌లో టీ తాగి తిరిగి వాహనం దగ్గరకు వస్తుండగా మంత్రాలయం వైపు నుంచి వస్తున్న బైకు రామకృష్ణను ఢీకొట్టింది. దీంతో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. రైతును ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు, వాహనం డ్రైవర్‌తో కలిసి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రామకృష్ణను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆసుపత్రిలో చేర్పించారు. అయితే ఆ తర్వాత ద్విచక్ర వాహనదారుడు ఆసుపత్రినుంచి చెప్పా పెట్టకుండా ఉడాయించాడు. కాగా వైద్యులు పరీక్షించి చికిత్స అందించేలోపే రైతు మతిచెందాడు. ఈ మేరకు పట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణకు భార్య రేణుకమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పెద్దహరివాణం మండలంపై అభ్యంతరాలకు అవకాశం

- 30 రోజుల గడువు : కలెక్టర్ సిరి



కర్నూలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతి పెద్ద మండలంగా ఉన్న ఆదోని నుంచి కొత్తగా పెద్దహరివాణం మండలంగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఆదోని మండలం పరిధిలో 29 గ్రామాలు, పెద్ద హరివాణం మండలంలో 17 గ్రామాలు చేర్చారు. ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచి 30 రోజుల్లోగా లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ సిరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను కలెక్టర్ చాంబర్‌లోనే అందజేయాల్సి ఉంటుంది. లిఖిత పూర్వకంగా మాత్రమే తీసుకుంటారు.

మండల విభజనలోనూ లోపాలు..

ఆదోని మండలాన్ని నాలుగు మండలాలుగా విభజించాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం పెద్దహరివాణం మండలాన్ని మాత్రమే కొత్తగా కేటాయించింది. అయితే ఆదోని మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన కల్లుబావి, పర్వతాపురం గ్రామాలను పెద్దహరివాణంలో చేర్చడం విమర్శలకు తావిస్తోంది. మున్సిపాలిటీలో వార్డులుగా ఉన్న ఆ గ్రామాలు పెద్దహరివాణంలో ఎలా విలీనం చేస్తారని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే ఆదోని మండలంలోని అలసందగుత్తి, సాదాపురం గ్రామాలను ఈ రెండు మండలాల్లో కూడా చూపకపోవడం కొసమెరుపు. ఆదోనికి అత్యంత సమీపంలో ఉన్న నారాయణపురం, చాగి, ధనాపురం, నాగనాతనహల్లి, బసాపురం, మదిరె, కడితోట గ్రామాలను పెద్దహరివాణం మండలంలో ఎలా చేరుస్తారని నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

పదమ్మా పోదాం.. మన ఇంటికి..!

ఎన్నెన్నో కలలు కంటూ పుట్టింటి నుంచి మెట్టినింట అడుగుపెట్టిన అమూల్య.. తిరిగి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పగింతల నాడు భర్తతో కలిసి వెళ్లిన తమ బిడ్డను 'చల్లగా వెళ్లిరా తల్లీ..' అని చెమ్మగిల్లిన కళ్లతో దీవించిన తల్లిదండ్రులు, ఇప్పుడు గుండె పగిలేలా ఏడుస్తూ విగతజీవిగా మారిన తమ బిడ్డను తీసుకుపోయారు. అప్పుడు ఒంటరిగా మెట్టినింటికి వచ్చిన అమూల్య.. ఇప్పుడు తన ప్రాణప్రదమైన కొడుకును వెంట తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మెట్టినింటితో మాత్రమే బంధం తెంచుకుని వెళ్లుంటే.. బాగుండేదేమో..! కానీ లోకంతోనే బంధం తెచుకుని, కొడుకుతో కలిసి వెళ్లిపోతూ.. కన్నవారికి గుండెకోతను మిగిల్చింది.



భర్త, కొడుకుతో అమూల్య(ఫైల్)

- కొడుకుతో కలిసి పుట్టినింటికి.. అమూల్య
- పోస్టుమార్టం అనంతరం మృతదేహాల తరలింపు
- డీటీ రవికుమార్, ఆయన తల్లిదండ్రులపై ఫిర్యాదు
- అర్ధరాత్రి కేసు నమోదు చేసిన అనంతపురం వన్‌టౌన్ పోలీసులు
- అదనపు కట్నం కోసం వేధింపులే కారణమని స్పష్టం

అనంతపురం క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'అమూల్య' జీవితం అర్ధాంతరంగా ముగియడానికి భర్త వేధింపులే కారణమని అర్థమవుతోంది. 'పెళ్లి సమయంలో రూ.70లక్షలకు పైగా కట్నం ఇచ్చాం. ఇల్లు కట్టుకునేందుకు ఇంకా డబ్బు కావాలని వేధించాడు. డబ్బులకే కాదు.. వేరే విషయాల్లోనూ వేధించాడు..' అని అమూల్య దగ్గరి బంధువు ఒకరు మీడియా ఎదుట కంటతడి పెట్టారు. అతన్ని కఠినంగా శిక్షించి, మాకు ఉపశమనం కలిగించాలి అని ప్రభుత్వానికి విన్నవించాడు. బాధిత కుటుంబ సభ్యులు పలువురు అమూల్య భర్త తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేధింపుల కారణంగానే పసివాడిని చంపేసి అమూల్య తనతో తీసుకువెళ్లిందని కంటతడి పెట్టారు. ముద్దుల కొడుకుతో, భర్తతో ప్రశాంతంగా జీవించాల్సిన అమూల్య ఇలా బలవన్మరణానికి పాల్పడటం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి డిప్యూటీ తహసీల్దారు రవికుమార్‌కు కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన రామకృష్ణ, రమాదేవి దంపతుల కూతురు అమూల్యను ఇచ్చి ఐదేళ్ల కిందట వివాహం జరిపించారు. వీరికి సహర్ష అనే బాలుడు సంతానం. వీరు అనంతపురం నగరంలోని జేఎన్టీయూ రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. కాగా అమూల్య, కుమారుడు సహర్ష అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. భర్త వేధింపులను భరించలేక.. కన్నకొడుకును చంపేసి, అమూల్య ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

ముగ్గురిపై ఫిర్యాదు

తమ అల్లుడు రవికుమార్ వేధింపుల కారణంగానే తమ కూతురు అమూల్య, మనవడు సహర్ష ప్రాణాలను కోల్పోయారని ఆమె తల్లిదండ్రులు రామకృష్ణ, రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం కోసం రవికుమార్ తమ కూతురును వేధించారని, అల్లుడితోపాటు అతడి తల్లిదండ్రులు కుళ్లాయప్ప, శివాంజినమ్మ కూడా వేధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో వరకట్నం ఇచ్చినా, అదనపు కట్నం కోసం వేధించారని పేర్కొన్నారు. అల్లుడు, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాలని కోరారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటన జరిగిన రోజు అర్ధరాత్రి బీఎన్ఎస్ 304బి కింద కేసు నమోదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు. ఒకటి రెండు రోజుల్లో అరెస్టు చూపించే అవకాశం ఉందని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.



అమ్మా నిన్నెప్పుడు చూడాలి.. రోదిస్తున్న తల్లి, బంధువులు

మీతో బంధం చాలు..

తల్లీకొడుకుల మృతదేహాలకు సంఘటనా స్థలం నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గురువారం అర్ధరాత్రి తరలించారు. వైద్యులు, ఫోరెన్సిక్ అధికారులు, పోలీసుల సమక్షంలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ అధికారులు సమగ్ర వివరాలను సేకరించారు. పోస్టుమార్టం అనంతరం అమూల్య, ఆమె కుమారుడి మృతదేహాలకు తమకు అప్పగించాలని రవి, ఆమె బంధువులు డిమాండ్ చేశారు. దీనికి అమూల్య తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. 'ఇక మీ బంధం చాలనుకునే మా అమ్మాయి ఇలా చేసుకుంది. మేమే ఇద్దరి మృతదేహాలను తీసుకువెళతాం..' అన్నారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని, అమూల్య కుటుంబానికే ఎక్కువ నష్టం జరిగిందని, వారే మృతదేహాలను తీసుకువెళ్లడం సరైనదని అన్నారు. మృతదేహాలను శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అప్పగించారు. తమ స్వగ్రామం కర్నూలు జిల్లా వెల్దురికి ఇద్దరి మృతదేహాలను అమూల్య కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు.

కనీస సౌకర్యాలు కల్పిస్తాం

- కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీబీసీడబ్ల్యూవో
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై ఆగ్రహం



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి ప్రసూన

కోసిగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ప్రసూన చెప్పారు. కోసిగిలో సంక్షేమ హాస్టళ్ల గజ గజ.. అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. రాత్రి 9 గంటల సమయంలో అధికారి ఆకస్మికంగా కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో కిటికీలు, దుప్పట్లు లేక ఇబ్బందులుపడు తున్నామని, మెనూ ప్రకారం భోజనం సక్రమంగా పెట్టడం లేదని, నైట్‌వాచ్‌మెన్, వార్డెన్ సిబ్బంది అందుబాటులో లేరని జిల్లా అధికారిణి ముందు విద్యార్థులు మొర పెట్టుకున్నారు. హాస్టల్ వార్డెన్, కమాటి, నైట్ వాచ్‌మెన్లపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట మాస్టర్లను మార్చి కొత్తవారిని ఏర్పాటు చేస్తామని, ప్రైవేటు వ్యక్తులతో వంట చేయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాకు 3వేల దుప్పట్లు రావాల్సి ఉందని, త్వరలోనే దుప్పట్లు హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు హాస్టల్ వార్డెన్లు విశ్వనాథ్ రెడ్డి, హారతి, కోసిగి హాస్టల్ వార్డెన్ గోపాల్, కమాటి ప్రసాద్, నైట్ వాచ్‌మెన్ రామయ్య ఉన్నారు.

వాహనాల తనిఖీల్లో.. 21 సెల్‌ఫోన్లు స్వాధీనం: సీఐ



నిందితులను చూపుతున్న సీఐ ఇంతియాజ్ బాషా

డోన్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనాల తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు మైనర్ల నుంచి 21 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. వివరాలు.. శుక్రవారం జాతీయ రహదారి 44పై మ్యాక్స్ హోటల్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇద్దరు మైనర్లు అనుమానాస్పదంగా పారిపోవడానికి యత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 21 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాదులో రద్దీ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. అపహరించిన ఫోన్లను వారి తండ్రులు రాంబాబు, ఎంకన్నకు అందజేసేవారని, వాటిని అమ్మి డబ్బులు సంపాదించేవారు. ఇద్దరు మైనర్లను జేసీఎల్ (జువైనల్ కంప్లికెట్ విత్ లా)-1, జేసీఎల్-2గా నమోదుచేసి వారి సంరక్షకులను పిలిపించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఇద్దరు మైనర్లతో పాటు వారి తండ్రులు రాంబాబు, ఎంకన్నను ఏ-3, ఏ-4గా గుర్తించారు. సెల్ ఫోన్ల యజమానులను గుర్తించి వారికి తిరిగి అందజేయుటకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాకేష్, ప్యాపిలి సీఐ వెంకట్రామిరెడ్డి, సబ్ డివిజన్ ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, నాగార్జున, మధుసూదన్, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడి టేషన్ కార్డుల కాలపరిమితిని మరో రెండు నెలల పాటు డిసెంబరు 1నుంచి వచ్చే ఏడాది జనవరి 31 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ, ఏదీ ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం నవంబరు 30 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో రెండు నెలల పాటు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు తెలియజేశారు.

జిల్లాలో మరో నాలుగు పత్తి కొనుగోలు కేంద్రాలు

- ఏడీఎం నారాయణమూర్తి



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో మరో నాలుగు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి వెల్లడించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు మార్కెటింగ్ శాఖ అధికార యంత్రాంగం ప్రతి రోజూ జిన్నింగ్ మిల్లుల్లో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి దాకా 6,276 మంది రైతుల నుంచి 1,81,466 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందుకుగానూ రూ.142.29 కోట్లు రైతులకు చెల్లించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సీసీఐ ఉన్నతాధికారులు సోమవారం నుంచి మరో నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో 15 కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు జరుగుతాయని స్పష్టం చేశారు. ఆదోనిలోనీ ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ ఫ్యాక్టరీ, బత్తిని జిన్నింగ్ మిల్లు, ఐశ్వర్య జిన్నింగ్ మిల్లు, విఘ్నేశ్వరి జిన్నింగ్ మిల్లు, శ్రీలక్ష్మి జిన్నింగ్ మిల్లు, ధర్మ జిన్నింగ్ ఫ్యాక్టరీ, ఎమ్మిగనూరులో ఎస్ఆర్‌పీవో మహాలక్ష్మి కాటన్ మిల్లు, శ్రీమురారి జిన్నింగ్ మిల్లు, మాధవ కాటన్ జిన్నింగ్ మిల్లు, శ్రీశివ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ మిల్లు, అదే విధంగా కోడుమూరులో మంజిత్ కాటన్ మిల్లు, మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లుల నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టామన్నారు. రైతులుపత్తి అమ్ముకునేందుకు సీసీఐ అధికారులు సూచించిన ప్రమాణాలు పాటించాలని సూచించారు. రైతులు ప్రస్తుతం రెండో విడత పొలాల్లో తీసిన పత్తిని అమ్ముకునేందుకు సీసీఐ అవకాశం కల్పించిందన్నారు. రైతులు కపాస్ కిసాన్‌యాప్‌లో స్లాట్లను బుక్ చేసుకుని వెంటనే సూచించిన తేదీ మేరకు పత్తిని అమ్ముకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కోడుమూరు మార్కెట్ కమిటి సెక్రటరీ సుందర్‌రాజు, ఎమ్మిగనూరుసెక్రటరీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- చైర్మన్ ఎం.వెంకట హరినాథ్



బాధితులకు చెక్కును అందజేస్తున్న చైర్మన్ వెంకట హరినాథ్

కర్నూలు లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించి సత్వర న్యాయం పొందవచ్చని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్ తెలియజేశారు. ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏమైనా వివాదాలు ఉంటే బాధితులు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలని ఆయన తెలిపారు. ఈ వివాదాల పరిష్కారానికి ఎటువంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయాన్ని ఉచితంగా రాజీ మార్గం ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ తీర్పులపై ఎటువంటి అప్పీలు ఉండవన్నారు. శుక్రవారం ఇన్సూరెన్స్ వివాదానికి సంబంధించిన ఓ కేసును సత్వరంగా పరిష్కరించినట్లు తెలిపారు. స్థానిక ఫిర్యాది తోట బుచ్చి అబ్బి 2019లో తన కుటుంబం మొత్తానికి స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ నుంచి ఒక మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకున్నాడు. ఆ తర్వాత ఆయన కుటుంబంలోని ఓ సభ్యుడు అనారోగ్యంతో ఆర్కా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. చికిత్సకు అయిన మొత్తాన్ని రూ.7,82,880 నగదును స్థానిక ఆర్కా ఆసుపత్రికి చెల్లించాడు. ఆ మొత్తాన్ని స్టార్ ఇన్సూ రెన్స్ కంపెనీకి క్లయిమ్ చేయగా.. వారు కేవలం రూ.2లక్షలు మాత్రమే చెల్లించారు. దీంతో మిగతా క్లయిమ్ మొత్తం కోసం ఫిర్యాది శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసును విచారించిన లోక్ అదాలత్ ఇరు పార్టీల రాజీ మేరకు ఫిర్యాదికి రూ.4,82,072 మొత్తాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించింది.

పవర్‌గ్రిడ్ సిబ్బంది దౌర్జన్యం

- అనుమతుల్లేకుండా పొలాల్లో పనులు
- నిరసన తెలిపిన రైతులు
- అబ్దులాపురంలో స్వల్ప ఉద్రిక్తత

కొలిమిగుండ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్దులాపురం, కోరుమానుపల్లెలో పవర్‌గ్రిడ్ సిబ్బంది రైతులపై దౌర్జన్యానికి పాల్పడింది. వారి అనుమతులు లేకుండానే విద్యుత్ టవర్లు, లైన్లు ఏర్పాటుచేస్తూ పంటలను ధ్వంసం చేసిందని రైతులు వాపోతున్నారు. శుక్రవారం రైతులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని నందిపాడు వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న పవర్‌గ్రిడ్ కేంద్రం నుంచి అనంతపురం జిల్లాకు 400కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను పవర్‌గ్రిడ్ చేపడుతుంది. ప్రస్తుతం పంటలు సాగులో ఉన్నా రైతులకు పరిహారం చెల్లించకుండా, సమాచారమి వ్వకుండా పనులు చేపడుతున్నారు. గురు, శుక్రవారాల్లో అబ్దులాపురం గ్రామానికి చెందిన రైతులు పవర్‌గ్రిడ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగి పనులను అడ్డుకున్నారు. రైతులతో చర్చించి, పరిహారం అందజేసి పనులు చేపట్టాలని రైతులు సంజప్ప, అంకాలు, బాబు, రాజేంద్రప్రసాద్, ఆదిరెడ్డి తదితరులు డిమాండ్‌చేశారు. నిబంధనలు పాటించకుండా రైతులపై దౌర్జన్యం చేస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.



సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రైతులు

పశువుల హాస్టల్ పరిశీలన

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తడకనపల్లె గ్రామంలోని పశువుల హాస్టల్‌ను చీఫ్ క్వాలిటీ కంట్రోల్, చీఫ్ విజిలెన్స్, పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనర్ గోపిచంద్ పరిశీలించారు. శుక్రవారం కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన కల్లూరు మండలం తడకనపల్లెలో పర్యటించి పశు వసతి కేంద్రాన్ని సందర్శించారు. హాస్టల్ నిర్మాణ పనులు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. డ్వామా పీడీ వెంకట రమణయ్య, పశుసంవర్ధక శాఖ ఏడీఏ పార్థసారధి, వెటర్నరీ సర్జన్ శ్రీకాంత్ రెడ్డి, పొదుపుసంఘం నాయకురాలు జుబేదాబేగం పాల్గొన్నారు.

పీహెచ్‌ఎన్‌లుగా పదోన్నతి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖ కడప జోనల్ పరిధిలో పని చేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ (ఫీమేల్)లకు పీహెచ్ఎన్ (నాన్ టీచింగ్)లుగా పదోన్నతి కల్పించారు. శుక్రవారం కడపలో ఆర్‌డీ డా.రామగిడ్డయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లాలో 19 మందికి పీహెచ్‌ఎన్‌లుగా పదోన్నతులు లభించాయి. ఇందులో కర్నూలు జిల్లాలో 7 మంది మహిళా ఉద్యోగులు కాగా మిగిలిన వారు నంద్యాల జిల్లాలో స్థానాలు తీసుకున్నారు.

ఆర్థికంగా బలోపేతం చేయాలి

పాణ్యం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీఎంటీసీ రైతు ఉత్పత్తిదారుల సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్, 12 మండలాల ఏపీఎంలకు డీఆర్‌డీఏ, హీఫర్ ఇంటర్ నేషనల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సమావేశంలో నాబార్డు ఏజీఎం కార్తీక్, ఏజీడీ వెంకటేశ్వర్లు, ఏరియా మేనేజరు ప్రసాద్, ఏడీఏహెచ్ పుల్లయ్య, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రవీంద్ర, హీఫర్ సంస్థ ప్రతినిధులు రవికాంత్, డీపీఎం నాయక్, ఎఫ్‌డీవో సురేష్, ఏపీఎంలు, సీసీలు, క్లస్టరు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

పాములపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగరవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాపురం జడ్పీ హైస్కూల్‌లో..

ఆత్మకూరురూరల్: విద్యార్థులు వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని నంద్యాల డీడీఏ మద్దిలేటి అన్నారు. శుక్రవారం వెంకటాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు భూసార ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీటీఎం ఉమామహేశ్వరి, వ్యవసాయ అధికారి హేమలత, పాఠశాల విద్యా కమిటీ మెంబర్ రాజేంద్రనాథ్‌రెడ్డి, హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు నిధులు మంజూరు

ఆత్మకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండోర్ స్టేడియం పెండింగ్ పనుల కోసం రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండ్లపల్లి రాంప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవినాయుడు రూ.98లక్షల నిధులను మంజూరు చేశారని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పీల్ మున్నా తెలిపారు. శుక్రవారం ఆయన విజయవాడలోని క్రీడాశాఖ మంత్రి, సోర్ట్స్ అథారిటీ చైర్మన్ కార్యాలయాల్లో వారిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో రైల్వేస్ వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ నిమ్మి కృష్ణ, శిక్షకులు రామకృష్ణారెడ్డి, నాగేళ్ల రాజా, ఉమాకాంత్, నక్క శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

వాచర్ కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్నఅధికారి

ఆత్మకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మృతి చెందిన ప్రొటెక్షన్ వాచర్ లక్ష్మానాయక్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల పరిహారాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ అనుప్‌సింగ్ అందజేశారు. శుక్రవారం మండలంలోని వైఎస్ఆర్ స్మృతివనంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. అటవీ ప్రాంతంలోని బేస్ క్యాంపులను పరిశీలించారు. ఆయన వెంట నాగార్జున సాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ విజయకుమార్, ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్, శ్రీశైలం, దోర్నాల సబ్ డీఎఫ్‌వోలు బబితకుమారి, నీరజ్, బైర్లూటి, వెలుగోడు రేంజ్ ఆఫీసర్లు కృష్ణప్రసాద్, తాహేర్, ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

నంద్యాల టౌన్ , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు నిబంధనలు పాటించాలని రవాణాశాఖ అధికారులు రవిశంకర్‌నాయక్, ప్రదీప్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్కూల్ బస్సులను తనిఖీలు చేశారు. డ్రైవర్లకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: విద్యార్థుల స్కూల్ బస్సుల భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు నంద్యాల మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేట్టారు. శుక్రవారం రవాశాఖ అధికారులు ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడులో బస్సులను తనిఖీ చేశారు.

నూనెపల్లెలో ఆర్‌వోబీ నిర్మించాలి

నంద్యాల రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): నూనెపల్లెలో ఆర్‌వోబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని నూనెపల్లె అభివృద్ధి కార్యాచరణ కమిటీ కన్వీనర్ శంకరయ్య కోరారు. శుక్రవారం జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ మెంబర్ రంగయ్యకు వినతి పత్రం అందజేశారు. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తోట ధనుంజయుడు, భూపాల్, రామస్వామి, బాలకొండారెడ్డి, షేక్‌బషీర్ పాల్గొన్నారు.

ఉల్లి రైతులకు పరిహారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నందికొట్కూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఉల్లి రైతులకు పరిహారం అందించేందుకు కూటమి ప్రభుత్వం స్పందించింది. నంద్యాల జిల్లా ఉల్లి రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో కూటమి ప్రభుత్వం వివక్షత చూపుతోందనే కథనాన్ని అక్టోబరు 31న 'ఆంధ్రజ్యోతి' ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఉల్లి రైతులకు నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

నంద్యాల హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ బేస్‌బాల్ పోటీలకు పట్టణంలోని సాయిబాబానగర్‌లోని నారాయణ పాఠశాల విద్యార్థి బద్రినాథ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్వరూపరాణి శుక్రవారం తెలిపారు. విద్యార్థిని పాఠశాల యాజమాన్యం అభినందించారు. పాఠశాల ఏజీఎం ప్రశాంత్, ఆర్ఐ చంద్రమౌళి, డీన్ నారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.


పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


ఆత్మకూరులో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు


నంద్యాలలో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఫయాజ్

పూలే ఆశయ సాధనలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
- నందికొట్కూరులో పూలే విగ్రహానికి నివాళి
- జిల్లా వ్యాప్తంగా పూలే వర్ధంతి

నందికొట్కూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావు పూలే ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య పిలుపునిచ్చారు. శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక విప్లవకారుడు, కుల వివక్షత, అంటరానితనంపై పోరాటం చేసి వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు మద్దిలేటి, భరత్, శ్రీను, గోవర్ధనగిరి, బ్రహ్మయ్య ఆచారి, బీసీ సంఘం నాయకులు కురుమూర్తి, ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగరాజు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

● పట్టణంలోని ఆత్మకూరు రోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకురాలు ఎస్‌టీటీ, శ్రీరాములు, స్వాములు పాల్గొన్నారు.


పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్ రెడ్డి


పాములపాడులో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

నంద్యాల రూరల్: బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని టీడీపీ రాష్ట్ర నాయకుడు ఎన్‌ఎండీ ఫయాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పద్మావతినగర్‌లోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, కుమ్మరి ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

● నంద్యాల పట్టణంలోని శిల్పా నివాసంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి నివాళి అర్పించారు. పూలే జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, నెరవాటి సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పాములపాడు: మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఆయా సంఘాల నాయకులు గోపాల్ , రాయపాటి మురళీమోహన్, నల్లమల అబ్రహాం పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


వెలుగోడులో..

ఆత్మకూరు : పట్టణంలోని సంగమేశ్వరం సర్కిల్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, పట్టణాధ్యక్షుడు శ్రీహరి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామియాదవ్, జయకృష్ణ, నాగరాజు, రమణ, శివ, ఈరన్న, శివన్నగౌడ్ తదితరులున్నారు.

వెలుగోడు: పూలే విగ్రహానికి బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్దుల్‌కలాం, ఎంఏఫ్ అనిల్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగశేషులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో మెనూ పాటించాలి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి సోషల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వసతిగృహాలలో వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని వసతిగృహాలకు 28 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు మంజూరయ్యాయని ఇవన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో, వసతిగృహాల్లో జరుగుతున్న భవన నిర్మాణ పనులు కాంపౌండ్ వాలు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి అందుకు సంబంధించిన బిల్లులను ఆర్‌డబ్ల్యూఎస్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

హెల్మెట్ ధరించాలి: డీఎస్పీ

ఆత్మకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడటం శ్రేయస్కరమని ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్ అన్నారు. శుక్రవారం సెఫ్టీ ఫస్ట్.. హెల్మెట్ మస్ట్ అనే నినాదంతో హెల్మెట్ ప్రాముఖ్యతపై ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని ఆయా స్టేషన్ల పోలీసులు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ర్యాలీ నంద్యాల టర్నింగ్‌కు, చక్రం హోటల్, గౌడ్‌సెంటర్‌కు చేరుకుంది. అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ యువత అతివేగం, ఫోన్లలో మాట్లాడుతూ వాహనాన్ని నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అన్నారు. పిల్లలు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. వాహన చోదకులందరు రహదారి నియమాలను పాటించినప్పుడే ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఐఎస్ఐ మార్కు ఉన్న నాణ్యమైన హెల్మెట్లను కొనుగోలు చేయడం ఉత్తమమన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, ఆయా స్టేషన్ల ఎస్సైలు నారాయణరెడ్డి, సురేష్, జయశేఖర్, పీఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.


బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ రామాంజీనాయక్

క్షేత్రస్థాయిలో సమన్వయంతో సాగాలి

- టీడీపీ జిల్లా అబ్జర్వర్ సుబ్బారావు


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

శ్రీశైలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని టీడీపీ జిల్లా అబ్జర్వరు వైవీ సుబ్బారావు అన్నారు. శుక్రవారం సుండిపెంట రెడ్డి కల్యాణమండపంలో ఎనిమిది బూత్‌లకు చెందిన కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులతో నియోజకవర్గం ఇన్‌చార్జి యుగంధర్ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో కార్యకర్తలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రభుత్వ సేవలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నవారికి ఆశయాలు సిద్ధాంతాలను వివరిస్తూ గ్రామ, మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి దోహద పడాల్సిందిగా సూచించారు. సమావేశంలో జిల్లా అబ్జర్వర్ రాముయాదవ్, మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జి రమణ, మైనార్టీ అధ్యక్షుడు బాషా, నాయకులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపివేస్తాం

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసరెడ్డి

కొత్తపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వరంలో భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లో నాణ్యత ప్రమాణాలు లేకుండా పనులు చేపడితే బిల్లులు నిలిపివేస్తామని నందికొట్కూరు డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను హెచ్చరించారు. శుక్రవారం కొత్తపల్లి ఏఈ జుబేర్‌తో కలిసి సంగమేశ్వరంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులను డీఈఈ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో స్వచ్ఛ భారత్ మిషన్- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కింద రూ.3లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో సంగమేశ్వరం దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వివరించారు.

రైతుల సంక్షేమం కోసం పంచసూత్రాలు

పగిడ్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగంలో నూతన మార్పులు తీసుకు వచ్చేందుకు పంచసూత్రాలను అమలు చేశారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం పగిడ్యాల గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మురళీధర్, ఎంపీడీవో సుమిత్రమ్మ, తహసీల్దారు శివరాముడు, ఎంఈవో సుభాన్, మండల కన్వీనరు మహేశ్వరరెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు శ్రీను, లోకానందరెడ్డి, మద్దిలేటి గౌడ్, భూషిగౌడ్, షమిన్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

గ్రామీణ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అర్జీలు స్వీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుమిత్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే పాల్గొని ఫిర్యాదు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల సిబ్బందిపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లా ఉల్లి రైతులకు నష్టపరిహారం అందజేసేందుకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. గ్రామాల్లో ఉల్లి పంటను సాగు చేసిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందేలా పంట నమోదు చేయాలని వ్యవసాయాధికారికి సూచించారు. పగిడ్యాలకు చెందిన రాజేశ్వరి, మేకల రామకృష్ణకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరాముడు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కస్టర్, బూత్ ఇన్‌చార్జిలు కృషి చేయాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. శుక్రవారం పగిడ్యాల లో మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: ఉద్యాన పంటల సాగు లాభదాయకమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శుక్రవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో రైతన్న-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, కేసీకాల్వ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ పరమేశ్వరరెడ్డి, టీడీపీ మండల నాయకులు, ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఏవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం

నంద్యాల కల్చరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుందూనది పక్కన వెలసిన కనకదుర్గా ఆలయ ప్రతిష్ఠ జరిగి 40రోజులు అయిన సందర్భంగా చండీహోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి ప్రభాకర శర్మ, విజయవాడ కనకదుర్గ ఆలయ అర్చకులు ఉమాశర్మ ఆధ్వర్యం లో ఆలయ ధర్మకర్తలు భవానీ కృష్ణ సోనియా దంపతులు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో భవానీ భక్తులు, బ్రాహ్మణసేవా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్, భక్తులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

- ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్


సింగరాజుపల్లిలో మాట్లాడుతున్న మౌలానా ముస్తాక్ అహ్మద్

కొత్తపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ లో వర్గ విభేదాలు లేకుండా సమిష్టిగా కృషి చేసి పార్టీని బలోపేతం చేద్దామని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ సూచించారు. శుక్ర వారం మండలంలోని సింగ రాజుపల్లి, గుమ్మడాపురం పాతమాడుగుల, ఎర్రమటం, ముసలిమడుగు గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ లింగస్వామి గౌడు ఆధ్వర్యంలో నాయకులు, బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ జడ్.వెంకటరెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, స్వామిరెడ్డి, నాగశేషన్న యాదవ్, లింగన్న, షఫీవుల్లా, అమర్నాథ్ యాదవ్, చంద్రారెడ్డి, మన్సూర్, రాము, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ పరికరాలపై అవగాహన సదస్సు

పాణ్యం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నానో స్కేల్ సెమీకండక్టర్ డివైస్ మోడలింగ్ అండ్ క్యారెక్టరైజేషన్ అంశంపై సదస్సును నిర్వహించారు. ఐదు రోజులుగా జరుగుతున్న ఈ సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో పరిశ్రమల నిపుణులు వాసుదేవరెడ్డి, ప్రిన్సిపాల్ జనయచంద్రప్రసాద్, డైరెక్టర్ అశోక్‌కుమార్, కోకన్వీనర్ సత్యప్రకాష్, కో ఆర్డినేటర్లు రామాంజనేయులు, చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంతో దిగుబడి, ఖర్చు అంచనా

పాణ్యం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంటకోత ప్రయోగంతో దిగుబడి, ఖర్చు అంచనా వేయవచ్చని జిల్లా ఆర్థిక, గణాంకాధికారి ఓబులేసు అన్నారు. శుక్రవారం పాణ్యంలోని 607 సర్వే నెంబరులో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంటను 25 అడుగుల మేరకు కోత కోసి దిగుబడి లెక్కించగా 12 కిలోల 350 గ్రాములు వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో మహబూబ్‌బాషా, ఏఈవో ఉమామహేశ్, వీఏఏ వినోద్, రాంమోహన్‌రెడ్డి, వీహెచ్‌ఏ అనూష, సిబ్బంది ఎల్లాభాస్కర్ పాల్గొన్నారు.

కొలతలు ప్రకారం తొలగిస్తాం

పాములపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే 340సి పనుల్లో భాగంగా మొదట కొలతలు వేసిన ప్రకారం కట్టడాలను తొలగిస్తామని నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. శుక్రవారం రుద్రవరం గ్రామంలో అక్రమ కట్టడాలని పరిశీలించి కొలతలు వేశారు. సర్వీసురోడ్డుకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ అధికారులు పక్షపాతం చూపకుండా రోడ్డు ప్రక్కన ఉన్న వారందరి ఇళ్లను కొలతలు వేయాలని, లేకుంటే కూల్చివేతలను అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు, నేషనల్ హైవే సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో సెక్యూరిటీ అనలిస్ట్ కోర్సుకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ లేదా బీటెక్, డిప్లొమా చదివిన వారు అర్హులని చెప్పారు. శిక్షణ 3 నుంచి 4నెలల ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7673902328 సంప్రదించాలన్నారు.

జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థికి అభినందన

ఆత్మకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీలో మండలంలోని వెంకటాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి రాజశేఖర్ డిప్యూటీ స్పీకర్‌గా రాణించిన తీరు ప్రశంసనీయమని ఆత్మకూరు అర్బన్ సీఐ రాము అన్నారు. శుక్రవారం విద్యార్థి రాజశేఖర్‌ను గిరిజన ఉద్యోగుల సమైక్య అధ్యక్షులు జవహర్‌నాయక్ ఆధ్వర్యంలో సీఐ రాము అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్‌బాలాజీనాయక్, మురళీనాయక్, హనుమంతునాయక్, కృష్ణయ్య, ఈశ్వరనాయక్ తదితరులున్నారు.

సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకోవాలి

కొత్తపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతాంగం రహదారులు, కల్లాల్లో ఆరబోసుకున్న మొక్కజొన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి నిల్వ ఉంచుకోవాలని మండల వ్యవసాయాధికారి అమీరున్నిసాబేగం తెలిపారు. శుక్రవారం మండలంలోని దుద్యాల గ్రామంలో ఏవో ఆధ్వర్యంలో ఎంపీడీవో మేరీ పర్యవేక్షణలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుందని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

పాణ్యం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గిరిజన బాలికలు క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని ఎంఈఓ కోటయ్య అన్నారు. శుక్రవారం బలపనూరు ఏపీ గురుకుల స్పోర్ట్స్ పాఠశాల అడ్మిషన్ల కోసం బాలికలకు క్రీడల ఎంపికను నిర్వహించారు. ప్రిన్సిపాల్ మేరీ సలోమి మాట్లాడుతూ నెల్లూరు, కర్నూలు, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 90 మంది గిరిజన బాలికలు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్రహ్మణ్యం, గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, హెచ్‌ఎం మాధవి, రవిచంద్ర, శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లెయిమ్ చేయని డబ్బును తిరిగి పొందవచ్చు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మీ డబ్బు మీ హక్కు' కార్యక్రమం ద్వారా గత 10 సంవత్సరాల నుంచి క్లెయిమ్ చేయని డబ్బు తిరిగి పొందవచ్చని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రవీంద్రకుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో శుక్రవారం 'మీ డబ్బు మీ హక్కు' కార్యక్రమంపై ప్రజలకు, ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు రూ. 64.59 కోట్లు 3.19 లక్షల మంది అకౌంట్లలలో ఉందని, ఈ డబ్బంతా ఆర్బీఐలో సేఫ్‌గా ఉందన్నారు. ఈ డబ్బును మనం తిరిగి ఉపయోగించుకోవడానికి బ్యాంకుల తరపున స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డ్వామా, మెప్మా పీడీలు, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ మనోహర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

మిడుతూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓ స్కూల్ బస్సు స్టీరింగ్ విరగడంతో చెట్టును ఢీకొట్టింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మిడుతూరుకు చెందిన ఓ ప్రవేటు స్కూల్ బస్సు శుక్రవారం చుట్టుపక్కల గ్రామాల్లోని విద్యార్థులకు ఎక్కించుకొని బయలుదేరింది. సుంకేసుల బాట సమీపంలో బస్సు స్టీరింగ్ విరిగింది. రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీ కొట్టడంతో బస్సులో హాహాకారాలు మొదలయ్యాయి. పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు బస్సు దగ్గరకు వెళ్లి విద్యార్థులను కిందకు దింపారు. ఈ ప్రమాదం త్రుటిలో తప్పిపోవడంతో పెను ప్రమాదమే తప్పిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు కాగా సుమారు 40 మంది పిల్లలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

నిరాశే మిగిలింది..

కలగా మిగిలిన జలదుర్గం మండలం

డోన్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజోతి): ప్యాపిలి మండలంలోని జలదుర్గం మండల కేంద్రం ఏర్పాటు కలగా మిగిలింది. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ కొత్త జిల్లాల ఏర్పాటు, మండలాల ఏర్పాటుపై సమీక్షించి ఆమోదాలు తెలిపింది. వీటిలో డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలంలోని జలదుర్గం నూతన మండలంగా ఏర్పడుతుందన్న ప్రజల ఆశలు ఆవిరయ్యాయి. 2024లో ఎన్నికల ప్రచారంలో భాగంగా డోన్ పాతబస్టాండులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్యాపిలి మండలంలోని జలదుర్గాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన మండల కేంద్రంగా చేర్చే బాధ్యత తీసుకుంటానని ఇచ్చిన హామీపై ప్రజలు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు జలదుర్గం గ్రామాన్ని సందర్శించి ప్రతిపాదనలు పంపడంతో జలదుర్గం గ్రామం నూతన మండలంగా ఏర్పడుతుందన్న ఆశ గ్రామ ప్రజల్లో చిగురిస్తుంది. అయితే ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన వాటిలో ప్యాపిలి మండలం జలదుర్గం లేకపోవడంతో ప్రజలు నిరాశకు గురయ్యారు.


జలదుర్గంలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

మండలంగా ఏర్పాటు చేయాలి



జలదుర్గంను నూతన మండలంగా ఏర్పాటు చేయాలి. జలదుర్గం గ్రామంలో 10వేలకు పైగా జనాభా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషన్, సంక్షేమ హాస్టల్, పశు వైద్యశాల, గ్రంథాలయం, అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. జలదుర్గం గ్రామ ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చాలి.

● రసూల్, ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు, జలదుర్గం

సకాలంలో బిల్లులు చెల్లించాలి

విద్యుత్ ఎస్ఈ సుధాకర్


మాట్లాడుతున్న ఎస్ఈ సుధాకర్

ఆళ్లగడ్డ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఎస్ఈ సుధాకర్ కోరారు. శుక్రవారం ఆళ్లగడ్డ విద్యుత్ డీఈ ఈ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న బిల్లుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాసులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటుదాం


మాట్లాడుతున్న బోయ మహేష్ నాయుడు

డోన్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటుదామని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ బోర్డు మెంబర్, బూత్ అడ్వైజర్ బోయ మహేష్ నాయుడు అన్నారు. శుక్రవారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడుతో పాటు పట్టణ అధ్యక్షులు టీఈ రాఘవేంద్రగౌడులను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరం కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సుదర్శన్ గౌడు, ఆటో బాషా, రంగస్వామి గౌడు, రామ గౌడు, ఐస్ బాషా, వీరాంజి, భూమ హరి, రాఘవ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

డోన్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం మహిళా వింగ్ అధ్యక్షురాలు రాజేశ్వరి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట సచివాల యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ టీ తాగుదాం.. మాట్లాడుకుందాం వంటి వినూత్న కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని కోరారు.

నేడు చెరువుల పరిశీలన

డోన్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రైతులకు, ప్రజల దాహార్తి తీర్చే చెరువులను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి గనియాతో కలిసి అన్ని చెరువులను పరిశీలించ నున్నారు. శనివారం ఉదయం 9.30 గంటలకు డోన్ మండలంలోని వెంక టాపురం చెరువు, ప్యాపిలి మండలంలోని వెంగళాంపల్లె, గుడి పాడు, చంద్రపల్లె, హుశేనాపురం చెరువులను పరిశీలించను న్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరు కావాలని ఎమ్మెల్యే కోట్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సచివాలయం తాళాలు అప్పగింత

డోన్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజోతి): మండలంలోని ఎద్దుపెంట గ్రామ సచివాలయానికి తాళాలు వేసిన సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పులిశేఖర్ శుక్రవారం డోన్ ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డిని కలిసి సచివాలయం తాళాలు అప్పగించారు. ఈ సందర్భంగా పులిశేఖర్ ఎద్దు పెంట సచివాలయ స్థితిగతుల గురించి ఎంపీడీవోకు వివరించారు.

కమ్యూనిస్టులపై విమర్శలు తగదు

కొలిమిగుండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటలు చేస్తూ, ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టు నాయకులపై బిల్డ ర్ పబ్బతి వేణు విమర్శలు చేయడం తగదని సీపీఐ నాయకులు సూరి, రైతు సంఘం నాయకులు పుల్లయ్య అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలో వారు మాట్లాడుతూ నంద్యాలలో స్వాతంత్ర్య సమరయోధుడు తాళపల్లి వీరయ్య కుటుంబం స్థలాన్ని బిల్డర్ ఆక్రమించడం అన్యాయమని, సీపీఐ నాయకులు ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తారా? అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో రామ్మోహన్, సుబ్బరాయుడు, బాలఎద్దయ్య, రాజా పాల్గొన్నారు.

వేణుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

బేతంచెర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలకు పాల్పడుతున్న పబ్బతి వేణుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాల యంలో మండల సహాయ కార్యదర్శి తాలుకా తిరుమలేష్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. భార్గవ్ మాట్లాడుతూ నంద్యాలలో స్వాతంత్ర సమరయోధుడు తాళ్లపల్లె వీరయ్యకు చెందిన ఆస్తిని కాజేయాలనే ఉద్దేశంతో నకిలీ దస్తావేజులు సృష్టించాడన్నారు. డి.దస్తగిరి, బాలు, ఖాదీర్ పాల్గొన్నారు.

భౌగోళిక గుర్తింపు కోసం తనిఖీలు

బనగానపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నందివర్గం చేనేత సహకార సంఘం కార్మికులు తయారు చేసే టవళ్లు, లుంగీల తయారీకి భౌగోళిక గుర్తింపు తేవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం నందివర్గం చేనేత సహకార సంఘ సభ్యులు తయారు చేసే లుంగీలు, టవళ్ల తయారీని అధికారులు తనిఖీ చేశారు. నందివర్గం చేనేత కార్మికులు తయారు చేసే టవళ్లు, లుంగీలకు దేశ. అంతర్జతీయ స్థాయిలో గుర్తింపు తేవడానికి రిసొల్యూట్ ఐపీ సర్వీసెస్ సుబజిత్ సాహా నేతృత్వంలో ప్రత్యేక బృందం కర్నూలు జిల్లా చేనేత సహకార సంఘం అధికారి నరసింహారెడ్డి, శాంతి సాగర్ నేతృత్వంలో తనిఖీ చేశారు. తయారు చేసే విధానం గురించి ప్రత్యేక బృందం చేనేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు.

బనగానపల్లె ఈవోగా సతీశ్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో సస్పెండ్‌కు గురైన బనగానపల్లె గ్రామ మేజర్ పంచాయతీ ఈవో సతీశ్‌రెడ్డి తిరిగి బనగానపల్లె ఈవోగా శుక్రవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. నెల రోజుల క్రితం ఈవో సతీశ్‌రెడ్డితో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఈవోలను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. గ్రామ సర్వేకు సంబంధించి ఒకే సెల్‌ఫోన్‌తో స్వర్ణపంచాయతీ పోర్టర్‌లో ఒకే నంబరుతో లింక్ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఈవోలను సస్పెండ్ చేశారు. ఈవోలకు సమయం ఇవ్వకపోవడంతో స్వర్ణపంచాయితీ పోర్టర్‌లో అనేక మంది ఈవోలు ఒకే నంబరుతో ఇంటింటి సర్వేను పోర్టల్‌లో లింక్ చేయడంతో సస్పెండ్ చేసింది. సాంకేతిక తప్పిదం కావడంతో ఈవో సతీశ్‌రెడ్డిని తిరిగి బనగానపల్లె గ్రామ పంచాయితీ ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● కలెక్టర్ రాజకుమారి
● గ్రామాల్లో 'రైతన్న మీకోసం'


గుండుపాపలలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

దొర్నిపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ రాజకుమారి గనియ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండుపాపల గ్రామంలో చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్‌ప్రాసెసింగ్, అన్నదాత సుఖీభవ ద్వార రైతులకు మద్దతు ధర వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రైతులు తమ పొలంలో నీటి కుంటలు, డ్రిప్, స్ప్రెయర్లు, సబ్సిడీ ద్వారా అందిస్తారని అన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల వ్యవసాయ సంచాలకుడు సుధాకర్, ఎంపీడీవో సావిత్రి, తహసీల్దార్ సుభద్ర, ఈవోపీఆర్డీ శివప్రసాద్, వ్యవసాయాధికారి ప్రమీల, పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, రమణ పాల్గొన్నారు.

బనగానపల్లె: రైతుల సంక్షేమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అప్పలాపురం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం పశువైద్యసహాయ సంచాలకుడు మారుతిసకారం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రైతుల కోసం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు సకాలంలో వారి ఖాతాలో జమ చేశారన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, పశువైద్య సిబ్బంది హుసేన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

చాగలమర్రి: రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లె, మల్లేవేముల గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో రంగనేతాజీ, ఏఈవో మంజుల, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, బాబయ్య, లూక, రైతులు పాల్గొన్నారు.

సంజామల: చిరు ధాన్యాల సాగు లాభసాటిగా ఉంటుంది ఏఈవో వెంకటేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రామిరెడ్డిపల్లె, సంజామల గ్రామాల్లో రైతన్న మీ కోసం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంచాల మద్దిలేటి రెడ్డి , మల్కి హుసేన్, మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, హార్టి కల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: రైతుల ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వలసల రామకృష్ణ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వలసల గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి కళ్యాణి, టీడీపీ నాయకులు సుధాకర్, లక్ష్మన్న, రమణ, రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ముందుగా మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఎంబాయి గ్రామంలో మంజూరైన పనులను అధికారులు చేయాల్సి ఉండగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆయన పీఆర్ ఇంజనీర్ మహేష్‌కు సూచించారు. తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ రాజశేఖర్‌రెడ్డికి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్ అధ్యక్షత నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే కోట్ల స్వీకరించారు. కార్యక్రమంలో తహ సీల్దార్ నాగమణి, నోడల్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, నగర కమిషనర్ హరిప్రసాద్, సీఐ వెంకటేశ్వరరావు, ఆయా శాఖల అధికారులతో పాటు టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్ జవాన్ కుమారుడి మృతి

బేతంచెర్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ దుర్గాప్రసాద్ కుమారుడు జాషువా (18) మృతి చెందాడు. జాషువా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ కొన్ని నెలల క్రితం జాషువా హైదరాబాదులో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చేరాడు. శుక్రవారం ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమ కుమారుడిని బతికించేందు కోసం రూ.కోటి దాకా తమసొంత డబ్బులు ఖర్చు చేశామని అయినా మా బిడ్డ మాకు దక్కలేదని తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ చలంరెడ్డి, వైసీపీ నాయకులు బొలెద్దుల రమేష్, మాజీ జడ్పీటీసీ సభ్యులు విజయరాజ్, నడ్డి శ్రీనివాసులు, సుందరరావు, గజ్జి మురళి, నత్తి అంజి జాషువ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి..

డోన్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డోన్-నంద్యాల రైల్వేగేట్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలా నికి చేరుకుని రైల్వే పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఆధారాలు, ఆధార్ కార్డు వంటివి ఏవీ లేకపోవడంతో ఎవరైన తెలిసిన వారు ఉంటే 9000031318కు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

జాతీయస్థాయి పోటీలకు పసుపుల విద్యార్థిని


ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

బనగానపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుల జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మైథిలి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అండర్-14 విభాగంలో మైథిలి ఇటీవల విశాఖ పట్నంలో నిర్వ హించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఫిజికల్ డైరక్టర్ డోర్కాస్‌ను, విద్యార్థిని మైథిలిని హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్లు అభినందించారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్యాపిలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఇటీవల అమరావతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వెంకటేశ్వరి, సుమాం జలి, అఖిలలు ప్రతిభ కనబరిచిన వారిలో ఉన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించడం వలన వీరు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడా పోటీలకు ఏర్పాట్లు

కొలిమిగుండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో డిసెంబరు-2 నుంచి నిర్వహించనున్న ఉపాధ్యాయ క్రీడా పోటీలకు ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. రామ్‌కో సిమెంట్ పరి శ్రమ సహకారంతో క్రీడా ప్రాంగణంలో గడ్డి, మట్టి తొలగించే పనులను ఉపాధ్యాయులు చల్లా కొండప్ప, రమణయ్య క్రీడల కో-ఆర్డినేటర్ నాగరాణి ప్రారంభించారు.

చౌడేశ్వరీ మాత పల్లకీ సేవ

బనగానపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. పల్లకీ సేవలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వాసవీ మాతకు విశేష పూజలు

చాగలమర్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కాన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు శుక్రవారం విశేష పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా వడిబియ్యం, కుంకు మార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి నవతాప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం

ఆళ్లగడ్డ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాళికామాత ఆలయంలో శుక్రవారం చండీ హోమం, పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. భవాని దీక్షలు స్వీకరించిన భక్తుల ఆధ్వర్యంలో చండీ హోమం జరిగింది. ఒంగోలు నుంచి వచ్చిన వేద పండితుల బృందం హోమం నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌అచారి, ఆలయ కమిటీ చైర్మన్ దురుగడ్డ రవీంద్రాచారి, సావిత్రమ్మ, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంను కలిసిన నాయకులు


ఆర్టీసీ డీఎంను సన్మానిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

డోన్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎంవీ చలపతిని డోన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, సభ్యులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిసి శాలువ కప్పి సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



చాగలమర్రి, బనగానపల్లెలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ, బీసీ సంఘం నాయకులు

చాగలమర్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీసెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు ఆధ్వర్యంలో జ్యోతి రావుపూలే వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవల గురించి కొనియా డారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, రామతీర్థం, వీర య్య, టీడీపీ నాయకులు టైలర్ బాషా, సుబ్బారావు, భాస్కర్‌రెడ్డి, రమేష్, బషీర్, ఓబులేసు పాల్గొన్నారు.

● జ్యోతిరావుపూలే సేవలు మరువలేనివని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బనగానపల్లె: బనగానపల్లెలో జ్యోతిరావు పూలే వర్ధంతిని బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వెంకటరమణగౌడ్, రిటైర్డు టీచర్ శివయ్య, పాండురంగాయాదవ్, శ్రీరాములు, దేవుడు, జనసేన భాస్కర్, వెంకటేశ్వర్లు, చల్లా బాలస్వామి, టైలర్ దస్తగిరి, మనోహర్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసమే శిబిరాలు


మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఆళ్లగడ్డ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్ల కోసమే ప్రభుత్వం వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని జిల్లా సమగ్ర శిక్ష విలీన విద్య సమన్వయకర్త జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ లోని ఎద్దుల పాపమ్మ కళాశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పిల్లలు హాజరయ్యారు. వీరికి అలింకో వైద్యులు ప్రియా వర్మ, తివారిలు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో నూర్జహాన్, విద్యాశాఖాధికారులు శోభావివేకవతి, గంగాధర్, ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయ కర్త ప్రసన్న పాల్గొన్నారు.

నేడు ప్యాపిలికి కలెక్టర్, ఎమ్మెల్యే రాక

ప్యాపిలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ రాజకుమారి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి శనివారం మండలానికి రానున్నట్లు శుక్రవారం టీడీపీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మండలంలోని వెంగ ళాంపల్లి, చంద్రపల్లి, గుడిపాడు, హుసేనాపురం గ్రామాల్లోని చెరువలను పరిశీలించనున్నట్లు టడీపీ వర్గాలు తెలిపాయి. మండలంలోని అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రేవనూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ఐ భూపాలుడు శుక్రవారం నంద్యాల - కోవెలకుంట్ల వెళ్లే రహదారిలో వాహనాలను తనిఖీ చేశారు. సర్టిఫికెట్లు, లైసెన్సులు లేని పది వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పక లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

బేతంచెర్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో పాణ్యం సిమెంట్స్ జూనియర్ కళాశాల పాలిటెక్నిక్ విద్యా ర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో గౌరు హుసేన్ రెడ్డి, గుండా గోపాల్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కిషోర్ కుమార్, వీహెచ్‌పీ బేతంచెర్ల మండల అధ్యక్షుడు నాగరాజు, రామ్మూర్తి, బజరం గదళ్ సంయోజక్ కోట్ల హరి, తేజ పాల్గొన్నారు.

'మన మిత్ర'ను వినియోగించుకోవాలి

చాగలమర్రి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు 'మన మిత్ర వాట్సాప్'ను వినియోగించుకోవాలని ఎంపీడీవో తాహిర్‌హుసేన్ సూచించారు. శుక్రవారం మద్దూరు గ్రామంలో మనమిత్ర వాట్సాప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి వాట్సాప్ సర్వీసులు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఆగిన ఆర్టీసీ బస్సు

రుద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రుద్రవరం - నంద్యాల ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం రుద్రవరంలో ఆగిపోయింది. డీజిల్ పైపు కట్ కావడంతో డీజిల్ లీక్ అయింది. డ్రైవరు అప్రమత్తం కావడంతో వెంటనే గమనించి రుద్రవరంలోనే బస్సును ఆపేశాడు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

ఉయ్యాలవాడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా రవికుమార్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా ఆదాంను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులను సన్మానించారు. రమణయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో వర్మీ కంపోస్టును తయారు చేయాలి

ఉయ్యాలవాడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయాలని డీఎల్‌డీవో శివారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉయ్యాలవాడ, సుద్దమల్ల గ్రామాలను ఆయన సందర్శించారు. గ్రామాల్లో తిరిగి చెత్త సేకరణను ఆయన పరి శీలించారు. అలాగే సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మి ఉన్నారు.

రోడ్డు ఇలా.. నడిచేది ఎలా ?

● బురదమయంగా కోరుమానుపల్లె ప్రధాన రహదారి

కొలిమిగుండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో ప్రధాన రహదారిపై బురద నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్డు ఇలా ఉంటే తాము నడిచేది ఎలా..? అంటూ వాపోతున్నారు. ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, రోడ్డు గుంతలమయంగా మారడంతో నిత్యం నీరు రోడ్డుపై నిలుస్తోంది. దీంతో ప్రజలు బురద నీటిలోనే నడుస్తూ ఇళ్లలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కోరుమానుపల్లెలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని కోరుతున్నారు.


ప్రధాన రహదారిపై నిలిచిన బురద